
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 21 । ఫిబ్రవరి । 2025



సదరం క్యాంప్

తెనాలి అర్బన్: స్థానిక జిల్లా వైద్యశాలలో గురువారం ప్రత్యేక సదరం క్యాంప్ జరిగింది. సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి పర్యవేక్షణలో వికలాంగులకు పరీక్షలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 535.30 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 9,160 క్యూసెక్కులు వదిలారు.

మందిర వార్షికోత్సవం



రేపల్లె రూరల్: రేపల్లెలోని అంబేడ్కర్ పార్కు సమీపంలో ఉన్న సాయిబాబా మందిర వార్షికోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. బాబా వారిని పట్టువస్త్రాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు జరిగాయి. తర్వాత హారతులు ఇచ్చారు. గులాబీలతో పుష్పయాగం చేశారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా ప్రవీణ్



బాపట్ల టౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల నియోజకవర్గానికి చెందిన దమ్ము పాల్‌ప్రవీణ్‌ను రాష్ట్ర బూత్ కమిటీ విభాగ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ప్రవీణ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి సిఫార్సు మేరకు నియమించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభ్యున్నతికి అహర్నిశలు శ్రమిస్తానని పేర్కొన్నారు.

అమరేశ్వరుని సేవలో మంత్రి సుభాష్



అమరావతి: ప్రముఖ శైవ క్షేత్రం అమరావతిలోని శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరుని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ గురువారం దర్శించుకున్నారు. తొలుత ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. ఆలయ అర్చకులు మంత్రికి ఆశీర్వచనం చేసి, స్వామివారి శేష వస్త్రంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సునీల్‌కుమార్, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక బస్సు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): భక్తుల కోరిక మేరకు ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు కుంభమేళాకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఈ స్పెషల్ హైటెక్ బస్సు బయలుదేరుంది. మొత్తం 8 రోజుల ప్రయాణంలో భాగంగా అయోధ్య, ప్రయాగ్‌రాజ్, వారణాసి ప్రాంతాలను సందర్శించేలా ఈ సర్వీసుకు రూపకల్పన చేశారు. ఉదయం 10గంటలకు బస్సు బయలుదేరనుంది. ఆన్‌లైన్‌లో టిక్కెట్ బుక్ చేసుకోదలచిన వారు 91927 సర్వీస్ నంబర్ ద్వారా టిక్కెట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒక్కో టికెట్ ధర రూ 8,300 నిర్ణయించారు. భోజనాలు, వసతి ఖర్చుల బాధ్యత ప్రయాణికులదే. మరిన్ని వివరాల కోసం 73828 97459, 73828 96403 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అధికారులు తెలిపారు.

క్వారీ ప్రాంతాన్ని పరిశీలించిన సబ్ కలెక్టర్



వీరనాయకునిపాలెం(చేబ్రోలు): గ్రామంలో జరిగిన మైనింగ్ జరిగిన ప్రాంతాన్ని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ గురువారం పరిశీలించారు. గ్రామానికి చెందిన కొందరు అక్రమ క్వారీయింగ్‌పై గ్రీన్ ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామ పరిధిలో జరిగిన మైనింగ్‌పై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి పూర్తి స్థాయిలో నివేదిక అందజేయాలని రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులను కోర్టు ఆదేశించింది. గ్రామానికి చెందిన నిరుపేద దళితులకు 32 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం అందజేసింది. ఆ భూమిలో కొందరు నేతలు ఎటువంటి అనుమతులు లేకుండా క్వారీయింగ్ చేశారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఎంతమేర మైనింగ్ జరిగిందనే దానిపై రెవెన్యూ, సర్వేయర్లతో నివేదికను తయారు చేస్తున్నారు. దీనిపై సిబ్బందికి సబ్ కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఫిర్యాదు చేసిన గ్రామానికి చెందిన పలువురు సబ్ కలెక్టర్‌కు తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందజేశారు. తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ, ఎస్ఐ డి.వెంకటకృష్ణ, మండల సర్వేయర్ సునీల్ పాల్గొన్నారు.

1,37,523 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): మార్కెట్ యార్డుకు గురువారం 1,29,446 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 1,37,523 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 67,713 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

కొనసాగుతున్న నష్టాలు

- జిల్లాలో 2.16 లక్షల ఎకరాల్లో వరి సాగు
- బస్తా ధాన్యం రూ.1,300 కూడా పలకని ధర
- 10 వేల ఎకరాల్లో మిర్చి పంట
- క్వింటా రూ.8 వేలకు మించి పలకని వైనం
- 64,165 ఎకరాల్లో పొగాకు సాగు
- సగానికిపైగా పడిపోయిన ధరలతో రైతులకు కన్నీరు
- 500 ఎకరాల్లో కంది పంట
- క్వింటా రూ.6,400కి మించి ఇవ్వని వ్యాపారులు

కూటమి పాలనలో అన్నదాతలకు అష్టకష్టాలు



అద్దంకి ప్రాంతంలో జూట్ సాగు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చంద్రబాబు పాలన అన్నదాతలకు అష్టకష్టాలు మిగులుస్తోంది. బాబు అధికారంలోకి వచ్చినప్పుడు ఒక్కోసారి కరవు వచ్చి పంటలు పండవు, ఇంకోసారి వరదలతో పెను నష్టాలు తప్పవు.. అన్నీ దాటుకుని పంటలు పండినా గిట్టుబాటు ధరలుండవు. రైతులకు చేయూత మచ్చుకైనా కనిపించదు. ఇప్పుడూ కూటమి అధికారంలోకి వచ్చాక ఇదే కొనసాగుతోంది. తొలి ఏడాది ఖరీఫ్ నుంచే రైతులకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రాజెక్టులు నీటితో నిండుకుండల్లా కళకళలాడాయి. పంటలు పుష్కలంగా పండాయి. అప్పటి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు అన్నివిధాలా ఆదుకుంది. కానీ బాబు పాలనలో జిల్లాలో అధికంగా సాగు చేసిన వరితోపాటు పొగాకు, మిర్చి, కంది తదితర పంటలకు మద్దతు ధర లేదు. కనీసం పెట్టుబడులు కూడా రాక అన్నదాతలు లబోదిబో అంటున్నారు.

నిండా మునిగిన వరి రైతులు

జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లో ఈ ఏడాది రైతులు 2,16,434 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరాకు 35 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వచ్చింది. 5,62,729 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. ప్రభుత్వం మాత్రం పట్టుమని 60 వేల మెట్రిక్ టన్నులూ మద్దతు ధరకు కొనలేదు. మిల్లర్లకు అమ్ముదామంటే బస్తా రూ.1,300కు మించి కొనలేదు. 5 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రభుత్వం కొన్న ధాన్యానికి మద్దతు ధర లభించగా.. బయట మార్కెట్‌లో బస్తా రూ. 2 వేలకుపైగా పలికింది. అన్నదాతలకు గిట్టుబాటు లభించింది.

మిర్చి రైతు కంట్లో కారం

జిల్లాలోని నగరం, సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, జె.పంగులూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో 9,330 ఎకరాల్లో మిర్చి సాగైంది. గత సంవత్సరం ఎకరానికి 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. క్వింటా రూ.22 వేలు పలికింది. ఈ ఏడాది ఎకరానికి 5 - 10 క్వింటాళ్ల లోపే దిగుబడి రాగా... ధర రూ. 8 వేల - రూ.10 వేలకు మించలేదు. కూలీల ఖర్చులు కూడా రావని రైతులు లబోదిబో అంటున్నారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర, ఇతరత్రా సాయం చేయకుండా మిర్చి రైతు కంట్లో కారం కొడుతోంది.

తేరుకోని పొగాకు రైతులు

ఈ ఏడాది శనగకు బదులు పొగాకు సాగుకు మొగ్గు చూపారు. సంతమాగులూరు, బల్లికురవ, మార్టూరు, యద్దనపూడి, పర్చూరు, కారంచేడు, ఇంకొల్లు, జె.పంగులూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో 64,165 ఎకరాల్లో సాగు చేశారు. బర్లీ వైట్ రకాన్ని అధికంగా.. కొంతమంది



పర్చూరులో సాగు చేస్తున్న పొగాకు

బ్యార్నీ రకం వేశారు. ఈ ఏడాది ధరలు పూర్తిగా పడిపోయినట్లు రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో బ్యార్నీ రకం క్వింటా రూ. 30 వేలు పలకగా.. ప్రస్తుతం సగంలోపే ఉంది. బర్లీ రకం రూ.10 వేలు- రూ. 13 వేలు ఉండగా.. ఇప్పుడు దారుణంగా రూ. 3,500 - 4 వేలలోపే పలుకుతోంది. కూలీల ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.

జూట్ రైతులకూ తీవ్ర నష్టం

జిల్లాలోని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో దాదాపు వెయ్యి ఎకరాల్లో జూట్ సాగు చేస్తున్నారు. గత ఏడాది క్వింటా విత్తనాలు రూ. 15 వేల వరకు పలకగా.. ప్రస్తుతం రూ. 5 వేలకు మించడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సగానికి సగం తగ్గిన కంది ధర

జిల్లాలోని సంతమాగులూరు, బల్లికురవ, పర్చూరు, అద్దంకి, కొరిశపాడు మండలాల పరిధిలో సుమారు 300 ఎకరాల్లో కంది వేశారు. గత ఏడాది క్వింటా రూ. 10 వేలుండగా... ఇప్పుడు రూ. 6 వేలకు మించి లేదు. ఎకరంలో 3 నుంచి 5 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తోందని, ఈ లెక్కన ఖర్చులు రావని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర లేక ఇబ్బందులు



మాది చిమటవారి పాలెం. రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశా. వైరస్‌తోపాటు నల్లి, తామర పురుగు తెగుళ్లతో దిగుబడి సగం తగ్గింది. దిగుబడి ఎకరానికి 5 క్వింటాళ్లు మించేలా లేదు. ధర రూ. 8 వేలకు మించి లేదు. గత ఏడాదితో పోలిస్తే కూలి ఖర్చులు రెండింతలు పెరిగాయి. అవీ ఇప్పుడు వచ్చేలా లేవు.

– గనిపిశెట్టి వెంకటరావు, రైతు

పొగాకు సాగుతో తీవ్రంగా నష్టం



గత ఏడాది 4 ఎకరాల్లో పొగాకు సాగు చేశా. క్వింటా రూ. 15 వేలకుపైగా పలికింది. మంచి రాబడి వచ్చింది. ఈ సంవత్సరం 7 ఎకరాల్లో వేశా. ఎకరాకు రూ. 1.50 లక్షలు చొప్పున పెట్టుబడి పెట్టా. ఈ ఏడాది క్వింటా ధర రూ. 4 వేలకు మించలేదు. కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదు.

–గొట్టిపాటి వెంకట్రావు, రైతు

దళారుల దెబ్బకు జూట్ ధరలు పతనం



దళారుల జోక్యంతో జూట్ ధరలు బాగా పతనమయ్యాయి. వారు అడిగిందే ధరగా మారింది. నాలుగు ఎకరాల్లో జూట్ వేశా. కోసే ముందు రూ.7 వేల వరకు ధర పలికింది. కొట్టే సమయానికి రూ.6 వేలకు, తర్వాత రూ.ఐదున్నర వేలకు పడింది. గతంలో రూ.15 వేల వరకు ధర లభించింది.

– ఎ. రాంబాబు, రైతు

కందికి మద్దతు ధర కరవు



మాది కొరిశపాడు. గతంలో కంది సాగు చేశా. క్వింటా రూ.15 వేల వరకు ఉండేది. మొన్నటి వరకూ అదే ధర కొనసాగింది. పంట వచ్చే సమయానికి ఇప్పుడు రూ.ఆరున్నర వేలకు పడిపోయింది.

– బ్రహ్మారెడ్డి, రైతు

11 మంది రెవెన్యూ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ఐవీఆర్‌ఎస్ సర్వేలో అవినీతి ఆరోపణలే కారణం

మార్టూరు: జిల్లా వ్యాప్తంగా కొందరు రెవెన్యూ సిబ్బందికి గురువారం జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. రెవెన్యూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు ఇటీవల ఎవరైనా మిమ్మల్ని లంచం అడిగారా? తీసుకున్నారా? అంటూ ప్రభుత్వం తరఫున ఫోన్ ద్వారా ఐవీఆర్‌ఎస్ సర్వే చేసిన సంగతి తెలిసిందే. అందులో భాగంగా జిల్లాలో 11 మంది రెవెన్యూ సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడం గమనార్హం. వారిలో అత్యధికంగా మార్టూరు మండలం నుంచి ఐదుగురు వీఆర్వోలు ఉండటం విశేషం. మండలంలో షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ద్రోణాదుల-2, కోలలపూడి, జొన్నతాళి, బొబ్బేపల్లి, మార్టూరు- 3 వీఆర్వోలు కే మోహన్ నాయక్, జి.వీరయ్య, ఎ. ఉమామహేశ్వరరావు, జి.రోశయ్య, కె.మోహనరావులు ఉన్నారు. మిగిలిన ఆరుగురిలో నగరం మండలం ధూళిపూడి గ్రామ సర్వేయర్ ఎం. గోపి నాగకృష్ణ, భట్టిప్రోలు వీఆర్‌ఓ ఎం .లక్ష్మి, అద్దంకి వీఆర్వో ఎం.శ్రీనివాసరావు, ఇంకొల్లు వీఆర్వో ఎం. సురేష్ ఉన్నారు. పర్చూరు మండలం ఉప్పుటూరు వీఆర్వో పి. నాగలక్ష్మి, జే. పంగులూరు మండలం రేణింగివరం వీఆర్వో వి. సుమతి షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో ఉన్నారు. వీరిని మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశిస్తూ కలెక్టర్ గురువారం సాయంత్రం నోటీసులు జారీ చేశారు.

సర్వే లోపాలమయం..

ఇదిలా ఉండగా ఈ విషయమై జిల్లాలోని కొందరు వీఆర్వోలు విలేకరులతో మాట్లాడుతూ ఐవీఆర్‌ఎస్ సర్వే లోపభూయిష్టంగా ఉందన్నారు. దరఖాస్తు చేయని వారికి కూడా ఫోన్ చేసి ఒకటి నొక్కమని ఒత్తిడి చేశారని చెబుతున్నారు. ఎప్పుడైనా ఎక్కడైనా కిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందే బలి పశువులు అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రైళ్లు రద్దు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): చర్లపల్లి-దానాపూర్-చర్లపల్లి రైళ్లను రద్దు చేసినట్లు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం తెలిపారు. చర్లపల్లి నుంచి దానాపూర్‌కు ఈనెల 21 -28వ తేదీ వరకు , దానాపూర్ నుంచి చర్లపల్లి వరకు 21 - 28వ తేదీ వరకు నడపదలిచిన ప్రత్యేక రైళ్లను రద్దు చేసినట్టు వివరించారు.

పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

- జిల్లాలో 103 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు
- రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి

చీరాల అర్బన్: జిల్లాలో పదో తరగతి పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టామని ఆర్‌జేడీ బి.లింగేశ్వరరెడ్డి అన్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై గురువారం స్థానిక వీఆర్‌ఎస్‌వైఆర్‌ఎన్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాలులో పరీక్ష కేంద్రాల చీఫ్‌లు, డిపార్టుమెంట్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, కస్టోడియన్లకు శిక్షణ నిర్వహించారు. ఆర్జేడీ మాట్లాడుతూ జిల్లాలో మార్చి 17 నుంచి జరగనున్న పదోతరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్ష పత్రాలు భద్రపరిచే కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులకు, 17 నుంచి 28వ తేదీ వరకు ఓపెన్ స్కూల్ విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 103 పరీక్ష కేంద్రాలో 16,361 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. విద్యార్థులు ఇబ్బంది పడకుండా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని, కాపీయింగ్ జరగకుండా చూడాలన్నారు. ప్రతి కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంట్ అధికారిని నియమించామని, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 10 రూట్‌లు ఏర్పాటుచేశామన్నారు. అన్ని కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలు, నెట్ సెంటర్‌ను మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాలకు నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు. భద్రత సిబ్బందిని, వైద్యసిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద, స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాల వద్ద మెడికల్ క్యాంపులు నిర్వహించి అత్యవసర మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాన్ని సెల్‌ఫోన్ రహిత ప్రాంతాలుగా ప్రకటించామని, చీఫ్‌తో సహా ఎవరి వద్ద సెల్‌ఫోన్ ఉండడానికి వీల్లేదన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, ఉప విద్యాశాఖాధికారి గంగాధరరావు, సురేష్, అసిస్టెంట్ కమిషనర్ ఫర్ ఎగ్జామ్స్ డి.ప్రసాదరావు, శ్రీనివాసరావు, చీరాల ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్‌రూముల వద్ద పకడ్బందీ భద్రత

గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ చెప్పారు. ఈనెల 27న జరగనున్న ఉమ్మడి గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ పెట్టెలను భద్రపరిచేందుకు ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన నాలుగు స్ట్రాంగ్ రూంలను గురువారం ఎస్పీ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నియమించాల్సిన పోలీస్ బందోబస్తు, స్ట్రాంగ్ రూంల వద్దకు వెళ్లే మార్గాలు, బ్యాలెట్ పెట్టెల తరలింపుపై చర్చించి, పలు సూచనలు చేశారు. అనంతరం రెవెన్యూ శాఖ నుంచి చేపట్టే ఏర్పాట్లపై ఆరాతీశారు. పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ చెప్పారు. స్ట్రాంగ్ రూంలో భద్రపరిచే బ్యాలెట్ పెట్టెల భద్రతపై ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చేపట్టాలని సూచించారు. ఏఎస్పీలు జీవీ రమణమూర్తి (పరిపాలన), హనుమంతు (ఏఆర్), ఏఆర్ డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, తూర్పు, పశ్చిమ తహసీల్దార్లు గణేష్ (తూర్పు), వెంకటేశ్వర్లు (పశ్చిమ), కళాశాల ప్రిన్సిపల్ మోజేస్ పాల్గొన్నారు.

గిరిజన భాషలకు సు'వర్ణ'మాల

- 19 భాషలకు లిపి రూపొందించిన ప్రొఫెసర్
- ఏకేఎన్‌యూ వీసీ స్థాయికి ఎదిగిన వైనం
- 'నారీ'శక్తిని చాటిన మహిళామూర్తి సాతుపాటి ప్రసన్నశ్రీ





నారీశక్తి పురస్కారాన్ని అందుకుంటూ..



గిరిజన బాలబాలికలతో..

తెనాలి: సాతుపాటి ప్రసన్న శ్రీ.. 19 గిరిజన భాషలకు లిపులను సిద్ధం చేశారు. ఈ ఇంగ్లిష్ ప్రొఫెసర్ ఇప్పుడు రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి(ఏకేఎన్‌యూ) ఉపకులపతి అయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్టూవర్టుపురం ప్రసన్నశ్రీ పూర్వీకుల ఊరు. ఒకప్పుడు పేరుమోసిన దొంగలకు నిలయమైన ఈ ఊరిలో సామాజికవేత్త హేమలతా లవణం వారిలో పరివర్తనకు కృషిచేశారు. ఫలితంగా అక్కడ నేరప్రవృత్తి కలిగిన పలువురు మారి చదువుకుని ఉద్యోగాలు చేపట్టారు. ఎందరో ఉన్నత స్థానాలకు చేరారు. ప్రసన్నశ్రీ తాత హేమలతా లవణం వంటి ప్రముఖులతో కలిసి ఆ కృషిలో భాగస్వామి అయ్యారు. ఆయన కుమారుడు ప్రసాదరావు చదువుకుని రైల్వే ఉద్యోగం చేపట్టారు. పలు ప్రాంతాల్లో పనిచేశారు. గుంటూరు జిల్లాలోని సీతానగరంలో ప్రసాదరావు స్థిరపడ్డారు. ఆయన కుమార్తె ప్రసన్నశ్రీ పలు ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేశారు. సర్దార్ పటేల్ మహావిద్యాలయంలో పీహెచ్‌డీ చేసిన ఆమె తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఆంధ్రా విశ్వవిద్యాలయంలో ఇంగ్లిష్ ప్రొఫెసర్‌గా రెండు దశాబ్దాలకుపైగా పనిచేశారు. ఎస్టీ ఎరుకల సామాజికవర్గానికి చెందిన ప్రసన్నశ్రీ, లిపి లేని గిరిజన భాషలు అంతరించిపోతుండటంపై ఆవేదన చెందారు. గిరిజనుల వెనుకబాటుకు అక్షరాస్యతే లోపమని భావించారు. అక్షరాలు ముఖ్యమని గ్రహించారు. దేశవ్యాప్తంగా పర్యటించారు. గిరిజన తండాలకు వెళ్లారు. అక్కడ జరిగే సంతలు, పండగుల్లో గిరిజనుల జీవన స్థితిగతులు, భాషలపై పరిశోధనలు చేశారు. గోండు, కోయ, బగట వంటి 19 గిరిజన తెగలు మాట్లాడుకునే భాషలకు సొంతంగా లిపిని రూపొందించారు. ఆంధ్ర, ఒడిశా సరిహద్దులోని గిరిజనులకూ ఓ లిపిని సిద్ధం చేశారు.

వరించిన పురస్కారాలు

ప్రసన్నశ్రీ పరిశోధనలకు గుర్తింపు లభించింది. 2021లో అప్పటి భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి నారీశక్తి పురస్కారాన్ని ప్రసన్నశ్రీ అందుకున్నారు. 19 గిరిజన భాషలకు అక్షర మాలలు రాసిన ఘనతకు అమెరికాలో మరో ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని కూడా స్వీకరించారు. 125 పరిశోధన వ్యాసాలు రాశారు. తన కృషికి ఇప్పటి వరకు 16 జాతీయ అవార్డులు, 15 అంతర్జాతీయ అవార్డులు అందుకున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఉపకులపతిగా నియమితులయ్యారు. ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

- బ్లాక్ స్పాట్లను గుర్తించండి
- అధికారులకు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ సతీష్ కుమార్ జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి 15రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. రోడ్ల మరమ్మతులు, ప్రమాదాల నియంత్రణకు చర్యలు తక్షణం ప్రారంభం కావాలని చెప్పారు. వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. గుంతల రహిత జిల్లా కోసం కృషి చేయాలని వివరించారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరిగితే తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్టు వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే మార్చి 1 నుంచి రూ.1,000 జరిమానా విధిస్తామని చెప్పారు. సమావేశంలో ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డీఎంహెచ్ఓ విజయలక్ష్మి, ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణ కుమారి, ఆర్టీఓలు సత్యనారాయణ ప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హోంగార్డుపై యువకుడు దాడి



చెరుకుపల్లి: మద్యం మత్తులో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. ఏకంగా పోలీసులపైనే దాడికి దిగాడు. వివరాలు.. గుళ్ళపల్లి గ్రామానికి చెందిన వాగు దినేష్ గురువారం సాయంత్రం మద్యం తాగి జాతీయ రహదారిపై వాహనాల ముందుకు వెళ్లాడు. ట్రాఫిక్ విధుల్లో ఉన్న కారంకి శ్రీనివాసరావు అనే హోంగార్డు, మరో కానిస్టేబుల్ ఎంత వారించినా వినలేదు. వారిని దుర్భాషలాడుతూ హోంగార్డు శ్రీనివాసరావును కింద పడేసి దాడి చేశాడు. చొక్కా చించేశాడు. ఎస్సై అనీల్‌కుమార్ సిబ్బందితో వచ్చి ట్రాఫిక్ నియంత్రించారు. దినేష్‌కు ఎంత చెప్పినా వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. హోంగార్డు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాలి

బాపట్ల టౌన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ పిచ్చయ్య, ప్రధాన కార్యదర్శి టి.వి. సురేష్‌లు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇప్పటికే ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు ఉన్నాయన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

మంగళగిరి టౌన్: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు మంగళగిరి పట్టణ పోలీసులు గురువారం తెలిపారు. మంగళగిరి పార్కు రోడ్డులో ఉంటున్న బాలిక గుంటూరు సమీపంలోని సిమ్స్ కాలేజీలో నర్సింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తండ్రి కొంతకాలం క్రితం మరణించడంతో బాలిక తల్లి తిరుపతమ్మ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో హౌస్ కీపింగ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఫిబ్రవరి 14న కాలేజీకి వెళ్లిన కుమార్తె సాయంత్రానికి ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతికింది. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2వేల కోట్లు కేటాయించాలి

మంగళగిరి టౌన్ : రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ. 2వేల కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ చేనేతలకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు. చేనేత సహకార సంఘాలకు బకాయి ఉన్న రూ. 172 కోట్లను వెంటనే విడుదలచేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, నేతన్న నేస్తం పథకాన్ని రూ.24 వేల నుంచి రూ.36 వేల రూపాయలకు పెంచాలని కోరారు. బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): ఉమ్మడి కృష్ణ – గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల ఏర్పాట్లను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగనున్న దృష్ట్యా స్థానిక ఏసీ కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చే గదులు, రిసెప్షన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను గురువారం సాయంత్రం కలెక్టర్‌తోపాటు జేసీ భార్గవతేజ పరిశీలించారు. అధికారులకు సూచనలు సలహాలు అందించారు. ఫిబ్రవరి 26న పోలింగ్ మెటీరియల్ పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఎన్నికల సిబ్బంది కోసం అన్ని వసతులూ కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి , ఆర్డీఓ కె. శ్రీనివాస రావు , ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి పవన్ కుమార్ , గుంటూరు తూర్పు , పశ్చిమ మండల తహశీల్దార్లు నగేష్ , వెంకటేశ్వర్లు, రెవెన్యూ , సర్వే అధికారులు పాల్గొన్నారు.

గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు ఆదివారం సజావుగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ భార్గవ తేజ తో కలిసి ఆమె పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. పలు సూచనలు చేశారు. జిల్లాలోని 11 పరీక్ష కేంద్రాల్లో 9,277 అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని వివరించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మీ, లైజన్ అధికారులుగా నియమించిన జిల్లా అధికారులు, పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను అరికట్టాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తి స్థాయిలో అరికట్టేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ సతీష్ కుమార్‌తో కలసి ఆమె నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌సీఓఆర్‌డీ) జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, ఎండీఎం, కొకైన్ వంటి మాదక ద్రవ్యాల కేసులు జిల్లాలో నమోదవుతున్నందున తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగంను అరికట్టేందుకు పర్యవేక్షణకు అంతర్గతంగా ప్రత్యేకంగా కమిటీలను పదిహేను రోజుల్లో ఏర్పాటు చేసేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మత్తు పదార్థాల రవాణా సమాచారం చేరవేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14405 టోల్ ఫ్రీ నంబరును విద్యా సంస్థల్లోనూ, జనసమ్మర్ద ప్రాంతాల్లోనూ ప్రదర్శించాలని చెప్పారు. నిరంతరం తనిఖీలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలపై గట్టి నిఘా పెట్టామని వివరించారు. విద్యార్థులు మత్తుపదార్థాలు తీసుకుంటున్నారని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు వివరించారు. నేరస్తులపై కేసులు నమోదు చేస్తున్నట్టు వివరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజా వలి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఏసీ కళాశాలలో ఎన్నికల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ భార్గవ్ తేజ, డీఆర్ఓ ఖాజావలి

కన్జర్వేషన్ రిజర్వ్‌గా ఉప్పలపాడు పక్షుల కేంద్రం

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): పెదకాకాని మండలం ఉప్పలపాడు పక్షుల కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం –1972 నిబంధనల ప్రకారం.. కన్జర్వేషన్ రిజర్వ్‌గా నోటిఫికేషన్ ఇచ్చినట్టు కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి వెట్ ల్యాండ్ మేనేజ్మెంట్ సమావేశంలో జేసీ భార్గవ తేజతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ఆఫీసర్ హిమ శైలజ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రం 20ఏళ్లుగా అటవీశాఖ ఆధ్వర్యంలో నడుస్తోందని వివరించారు. దీనిని కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. అరుదైన పక్షి జాతులను కాపాడుకోవాలని చెప్పారు. వెట్ ల్యాండ్ ఉపయోగాలను వివరించారు. జిల్లాలో ఇప్పటి వరకు అటవీశాఖ ద్వారా గుర్తించిన 300 వెట్ లాండ్స్‌ను పంచాయతీ రాజ్, ఇరిగేషన్ , ఆర్ డబ్ల్యూఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు , రెవెన్యూ స్టేక్ హోల్డర్ శాఖల అధికారులు పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి , ఆర్డీఓ కె.శ్రీనివాసరావు , పశు సంవర్ధక శాఖ జేడీ ఓ.నరసింహారావు , ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం , ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎస్ఈ కళ్యాణ చక్రవర్తి , డీఎల్‌పీఓ శ్రీనివాస్ రెడ్డి , పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీనా బేగం , ఫారెస్ట్ రేంజ్ అధికారులు డి.పోతురాజు, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలి

జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తమ్

బాపట్ల టౌన్: విద్యార్థి దశ నుంచే శారీరక దృఢత్వంపై దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తమ్ తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 6 – 9 తరగతు విద్యార్థినులకు కరాటేలో శిక్షణ ఇప్పించడం జరుగుతుందన్నారు. జీసీడీవో చారులత మాట్లాడుతూ ఆత్మరక్షణ సాహసానికి తొలి మెట్టు అన్నారు. ఈ శిక్షణ 20 రోజులు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ రాము, ట్రైనర్స్ ఇన్‌చార్జి ఉమామహేశ్వరరావు, సమగ్ర శిక్ష ఏఎంఓ మోసేస్, ఐఈడీ జోత్స్న సీఎంఓ శ్రీనివాస రెడ్డి, ఏఎస్‌ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

టీటీడీ సభ్యుడిపై చర్యలు తీసుకోండి

నరసరావుపేట: శ్రీ వెంకటేశ్వరుడు నిలయమైన తిరుమల ఆలయంలో మహా ద్వారం వద్ద విధు లు నిర్వహిస్తున్న బాలాజీ సింగ్‌పై టీటీడీ పాలకవర్గ సభ్యుడు నరేష్‌కుమార్ అసభ్యకరమైన పదజాలంతో విరుచుకుపడటాన్ని ఏపీ రాష్ట్ర బొందిలి సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. స్థానిక కార్యాలయంలో గురువారం సంఘ నాయకులు సమావేశమయ్యారు. సంఘ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాస సింగ్ మాట్లాడుతూ విధుల్లో ఉన్న ఉద్యోగిపై నరేష్‌కుమార్ ''నిన్ను ఎవరు ఇక్కడ పెట్టించింది.. ఏమనుకుంటున్నావు.. నీ సంగతి చూస్తా.. ఎవరితో ఎలా మాట్లాడాలో తెలియదా? నువు ముందు బయటికి పో'' అంటూ దూషించడం దారుణమని తెలిపారు. వెంటనే నరేష్ కుమార్ క్షమాపణ చెప్పాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పందించి పాలకవర్గ సభ్యుడుగా ఉన్న అతడిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో దొంగలు

చేబ్రోలు: చేబ్రోలు గ్రామ పంచాయతీకి చెందిన పెద్ద మంచినీటి చెరువులో అర్ధరాత్రి సమయంలో చేపలు పట్టుకున్న ఇద్దరు స్టువార్టుపురం దొంగలు పోలీసులు అదుపులో ఉన్నారు. చేబ్రోలు పరిధిలోని కొమ్మమూరు చానల్‌కు పక్కనే ఉన్న 22 ఎకరాల మంచినీటి చెరువులో కొంతకాలంగా రాత్రి సమయాల్లో పెద్ద పెద్ద చేపలను పట్టుకొని వెళ్తున్నారు. నీళ్ల మోటార్లు, కాపర్, యంత్ర పరికరాలు అపహరణకు గురవతుండటంతో పంచాయతీ కార్యదర్శి కారసాని శ్రీనివాసరావు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఆటోలో వచ్చి నలుగురు దొంగలు మంచినీటి చెరువులోని పెద్ద పెద్ద చేపలను పట్టుకుండటంతో పంచాయతీ సిబ్బంది పథకం ప్రకారం వారిలో ఇద్దరిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మరో ఇద్దరు పరారయ్యారు. వీరంతా స్టువార్టుపురానికి చెందిన వారిగా గుర్తించారు. దీనిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలి



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): కౌలు రైతులకు ఎటువంటి ష్యూరిటీలు లేకుండా పంట రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి.జగన్నాథం డిమాండ్ చేశారు. ఈ మేరకు జీటీ రోడ్డులోని లీడ్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సచివాలయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ సమావేశంలో కౌలు రైతులకు పెద్ద ఎత్తున పంట రుణాలు ఇచ్చామని చెప్పడం విడ్డూరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులను రక్షించిన పోలీసులు

సత్తెనపల్లి: అదృశ్యమైన ఐదుగురు మైనర్ విద్యార్థినులను పల్నాడు జిల్లా సత్తెనపల్లి పోలీసులు గురువారం రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా గన్నవరంలోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో చదువుతున్న ముస్తాబాద్‌కు చెందిన ఐదుగురు మైనర్ విద్యార్థినులు అదృశ్యం కావడంతో వారి బంధువులు గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన గన్నవరం పోలీసులు సాంకేతికతను వినియోగించి, విద్యార్థినులు సత్తెనపల్లి మీదుగా హైదరాబాద్ వెళుతున్నట్లు గుర్తించారు. వెంటనే సత్తెనపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు ఆధ్వర్యంలో సీఐ బొప్పన బ్రహ్మయ్య, ఏఎస్ఐ రమణ, సిబ్బంది దరియావలి, సలీం, దశరథ్‌నాయక్‌లు ఉదయం 6:30–7:00 గంటల మధ్య విజయవాడ–నల్గొండ వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించారు. ఐదుగురు విద్యార్థినులను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు.

హజరత్ మస్తాన్ వలి

దర్గాను స్వాధీనం చేసుకోవాలి

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు నగరంలోని హజరత్ కాలే మస్తాన్ వలి దర్గాను రావి రామ్మోహనరావు, అతని కుమారుడు మస్తాన్ సాయి వ్యాపార కేంద్రంగా మార్చారని ముస్లిం సేన రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ గుంటూరు జిల్లా వక్ఫ్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ షేక్ సుభాని, ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా ధ్వజమెత్తారు. స్థానిక నగరంపాలెంలోని ముస్లిం సేన రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రావి రామ్మోహనరావు కుటుంబానికి ఈ దర్గాకు సంబంధం లేదని కోర్టు స్పష్టం చేసినా, గత వక్ఫ్ బోర్డులో ఇతనిపై చర్యలు తీసుకోవాలని షోకాజ్ నోటీస్ ఇచ్చి దర్గాను స్వాధీనం చేసుకోవాలని వక్ఫ్‌బోర్డు నిర్ణయించినా వక్ఫ్ బోర్డు సీఈఓ కనీస చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా సర్కారు, వక్ఫ్ బోర్డు అధికారులు దృష్టి సారించి దర్గాను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. మస్తాన్ సాయిపై డ్రగ్స్, మహిళలను మోసం చేసిన కేసులు నమోదయ్యాయని, ఇది దర్గా పవిత్రతకు భంగం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్, మైనార్టీ నాయకుడు సైదా, సత్య పలువురు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో మెరిసిన విద్యార్థికి సత్కారం



తెనాలి: జాతీయ స్థాయి ఐఐటీ–జేఈఈ మెయిన్‌లో రికార్డు స్థాయిలో 99.37 పర్సెంటైల్ సాధించిన తెనాలి వివేక జూనియర్ కాలేజి విద్యార్థి తూనుగుంట్ల వెంకట పవన్‌కుమార్‌ను రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అభినందించారు. తెనాలిలోని తన కార్యాలయంలో శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పేద కుటుంబానికి చెందిన పవన్‌కుమార్‌కు ప్రభుత్వపరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పవన్‌కుమార్ వెంట ఉన్న వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు, సీఈవో ఉదయ్‌కిరణ్‌ను మంత్రి మనోహర్ ప్రశంసించారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో గురువారం 168 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు. సరుకు 139 బస్తాలకు కనిష్ట ధర రూ.8400 గరిష్ట ధర రూ.10,750 మోడల్ ధర రూ.10,750, కాయలు 29 బస్తాలకు కనిష్ట ధర రూ.8,400, గరిష్ట ధర రూ.10,001, మోడల్ ధర రూ.10,001 పలికింది. మొత్తం 126 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు వెల్లడించారు.

మహిళల రక్షణపై దృష్టి ముఖ్యం



డీజీపీ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: మహిళల రక్షణపై దృష్టి సారించాలని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుంచి గురువారం సాయంత్రం రాష్ట్రంలోని ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాపట్ల జిల్లా నుంచి ఎస్పీ తుషార్‌డూడీ హాజరయ్యారు. అనంతరం జిల్లాలోని పోలీస్ అధికారులతో ఎస్పీ మాట్లాడుతూ.. రానున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతున్న ప్రదేశాలను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్‌లనే ధరించేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలిపారు. కొత్త చట్టాలపై సిబ్బందికి అవగాహన కల్పించాలని, డ్రోన్లను విరివిగా వాడుతూ పట్టణ ట్రాఫిక్ ప్రాంతాల్లో సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఆహార భద్రతా శిక్షణ కేంద్రం ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న గరికపాటి ప్రభాకరరావు

బాపట్ల టౌన్: ఆహార, కిరాణా, మాంసం, మిఠాయి వంటి షాపుల నిర్వాహకులు శిక్షణ తీసుకొని ధ్రువపత్రాలు పొందాలని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ గరికపాటి ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలోని విజయలక్ష్మీపురంలో గురువారం ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్ కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ ప్రణీత్, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ కలకండ ప్రవీణ్ కుమార్, బాపట్ల బ్రాంచ్ మేనేజర్ నవీన్, కిరాణా అసోసియేషన్ సెక్రటరీ దిలీప్, ఫ్యాన్సీ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాస్, రాధాకృష్ణ, నాగేశ్వరరావు, ముప్వ శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

బైకును ఢీకొన్న బస్సు.. ఒకరు మృతి



దుర్గాప్రసాద్ మృతదేహం

చెరుకుపల్లి: కావూరు ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరం మండలం పెదమట్లపూడి శివారు ఉక్కావారి పాలెం గ్రామానికి చెందిన ఆట్ల దుర్గాప్రసాద్(25), కేశన గోపి కలసి గురువారం ఉదయం మిరప నారు కొనేందుకు బాపట్ల వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో మధ్యాహ్నం కావూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో జాతీయ రహదారిపై రేపల్లె డిపో ఆర్టీసీ బస్సు వీరిని ఢీకొంది. దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. గోపీకి తీవ్ర గాయాలు కావటంతో 108 సాయంతో తెనాలి ఏరియా ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్సై టి.అనిల్‌కుమార్ ప్రమాదానికి కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

బాపట్ల టౌన్: వైద్యారోగ్య శాఖలో పనిచేసే రెగ్యులర్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు కూరపాటి సత్యంరాజు గురువారం రాష్ట్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. సత్యంరాజు మాట్లాడుతూ.. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, అన్ని క్యాడర్స్‌లో వారికి వంద శాతం గ్రాస్ వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్స్ ఉద్యోగులకు బదిలీల సౌకర్యం కల్పించాలన్నారు. జీవో 143 సరళతరం చేసి, తొలగించబడిన హెల్త్ అసిస్టెంట్‌లను మానవతా దృక్పథంతో తిరిగి నియమించాలని పేర్కొన్నారు. ఆర్థికపరమైన అంశాలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవకాశం ఉన్నంతవరకు త్వరలోనే పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అసోసియేషన్ సభ్యులు వైవీ శేషయ్య ఉన్నారు.

ఆరుగురు గంజాయి విక్రేతల అరెస్టు

నిందితుల్లో ఒకరు మైనర్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు, పక్కన సీఐ మల్లికార్జునరావు

తెనాలిరూరల్: గంజాయి విక్రయిస్తున్న మైనర్ సహా ఆరుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. తెనాలి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం సాయంత్రం డీఎస్పీ బి.జనార్దనరావు వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావుతో కలిసి కేసు వివరాలు వెల్లడించారు. కొల్లిపర మండలం వల్లభాపురానికి చెందిన ఆరుమళ్ల సాహిత్ రెడ్డి, రెడ్డిబత్తుల హర్షవర్ధరెడ్డి, పాముల రిషిబాబు, తెనాలి రామలింగేశ్వరపేటకు చెందిన యర్రమోతు పవన్ ప్రశాంత్, నాజరుపేటకు చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు, గంగానమ్మపేటకు చెందిన మరో మైనర్ కలిసి వైకుంఠపురం రైల్వే అండర్ పాస్ వద్ద గంజాయి విక్రయిస్తుండగా అందిన సమాచారంతో గురువారం అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువచ్చి తెనాలిలో అమ్ముతున్నట్టు గుర్తించామని వెల్లడించారు. వీరి వద్ద నాలుగు కిలోల 50 గ్రాముల గంజాయితోపాటు రూ. 4,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ మల్లికార్జునరావు, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

టోల్ ప్లాజాల వద్ద సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌వో ఆర్‌కే సింగ్



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌వో ఆర్‌కే సింగ్

మంగళగిరి: టోల్ ప్లాజాల వద్ద ప్రయాణికుల కోసం వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని ఎన్‌హెచ్‌ఏఐ ఆర్‌వో ఆర్‌కే సింగ్ తెలిపారు. నగర పరిధిలోని కాజ టోల్ గేట్ వద్ద ఏర్పాటు చేసిన కొత్త అంబులెన్స్‌లతోపాటు బేబి కేర్ రూమ్‌లను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అంబులెన్సులు, బేబీకేర్ రూంలు ప్రయాణికులకు సౌలభ్యంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా మేనేజర్ రవి, బేబీ కేర్ రూమ్ దాతలు శ్రీ వేంకటేశ్వర ఫుడ్ బేవరేజస్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులు పాలడగు కృష్ణ వంశీ,శ్రీనివాసరావు, కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న రాధాకృష్ణమూర్తి, శ్రీధర్, రమేష్‌బాబు తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి కోరారు. ఈ మేరకు గురువారం ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గుంటూరులోని రైతు సాధికార సంస్థ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం సీఈవో రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో 15 వేల మంది ప్రకృతి వ్యవసాయంలో భాగస్వాములై అనేక క్యాడర్లలో పనిచేస్తున్నారని తొమ్మిది ఏళ్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం అమలు చేయడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. రైతులకు చేరదీసే విషయంలో కష్టపడి పనిచేస్తున్న అనేక క్యాడర్ల ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. వారిని అర్ధాంతరంగా తొలగించే విధానాన్ని ఆపాలని సూచించారు. అంతేకాకుండా తొలగించిన వారిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలన్నారు. పి.ఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో వేతనాల పెంపుకై ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు.